నడకకు కాదు... వ్యాపారానికే..!

- జీవీఎంసీ 54, 55 వార్డుల్లో ఫుట్‌పాత్‌ల ఆక్రమణ
- దుకాణాల నిర్వహణ, పార్కింగ్‌కు వినియోగం
- పాదచారుల ఇబ్బందులు పట్టించుకోని అధికారులు



ఊర్వశి కూడలిలో ఫుట్‌పాత్‌పై నిర్వహిస్తున్న వ్యాపారాలు



104 ఏరియాలో బీఆర్‌టీఎస్ రహదారికి ఆనుకుని కార్ షోరూమ్ ఉద్యోగుల ద్విచక్ర వాహనాలు

కంచరపాలెం : జీవీఎంసీ 54, 55వ వార్డుల పరిధి కంచరపాలెం – మర్రిపాలెంలో ఫుట్‌పాత్‌లు నానాటికీ అలంకారప్రాయమైపోతున్నాయి. జీవీఎంసీ లక్షలక్షలాది రూపాయలు వెచ్చించి ఆధునికీకరిస్తున్నా... అవి పాదచారులకన్నా వ్యాపారులకే ఎక్కువగా ఉపయోగపడుతున్నాయి. కంచరపాలెం నేతాజీ కూడలి ప్రధాన రహదారికి ఆనుకుని డక్ట్‌లపై ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లు వాహనాల పార్కింగ్, చిరు వ్యాపారుల దుకాణాల ఏర్పాటు కోసమే నిర్మించినట్టుగా ఉన్నాయి. మర్రిపాలెం 104 ఏరియా, ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఐటీఐ జంక్షన్, ఊర్వశి కూడలి, కంచరపాలెం ముత్యమాంబ జంక్షన్ నుంచి ఇటు తాటిచెట్లపాలెం, అటు జ్ఞానాపురం రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారిలో ఫుట్‌పాత్‌లను కొందరు కబ్జా చేసేస్తున్నారు. ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రధాన రహదారిలో ఓ కారు షోరూమ్ సిబ్బంది బైక్‌లను పాదచారులు నడిచే ఫుట్‌పాత్‌లపై నిత్యం పార్కింగ్ చేస్తున్నారని వాకర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోట్ల రూపాయలు ఖర్చు చేసి షోరూం నిర్మించారని, సిబ్బంది వాహనాలు రోడ్లు, ఫుట్‌పాత్‌లపై పార్కింగ్ చేయడం విడ్డూరంగా ఉందని పలువురు వాపోతున్నారు. కంచరపాలెం రైతుబజారు ప్రహరీకి ఆనుకుని ఉన్న ఫుట్‌పాత్‌లపై ఇష్టారాజ్యంగా చిరు వ్యాపారులు వ్యాపారాలు సాగిస్తూ వాహనాల రాకపోకలకు అడ్డంగా నిలుస్తున్నారు.



ఐటీఐ కూడలిలో ఫుట్‌పాత్‌పై దుకాణం



కంచరపాలెం బీఆర్‌టీఎస్ రహదారిలో పరిస్థితి ఇదీ...

కూటమి ప్రభుత్వంలో నాయకులు, కార్యకర్తల హవా మితిమీరడంతో వ్యాపారులు స్వేచ్ఛగా ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారు.

భవనాల ఎదుటే యథేచ్ఛగా వ్యాపారాలు



కంచరపాలెం బీఆర్‌టీఎస్ రహదారిలో ఫుట్‌పాత్ ఆక్రమణ ఇలా...

కంచరపాలెం నేతాజీ కూడలి నుంచి మర్రిపాలెం, అటు 104 ఏరియా నుంచి ఐటీఐ జంక్షన్, ఊర్వశి కూడలి మీదుగా తాటిచెట్లపాలెం వెళ్లే సర్వీస్ రహదారుల పక్కనే ఉన్న భవనాల ముందు వ్యాపారాలు నిర్వహించడం వల్ల కూడా ఇటువంటి సమస్యలు ఎదురొతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. వ్యాపార, వాణిజ్య అవసరాలకు వచ్చే వారు వారి వాహనాలను బీఆర్‌టీఎస్ సర్వీస్ రహదారులపై పార్కింగ్ చేస్తున్నారు. దూర ప్రాంతాలకు నిత్యం ప్రయాణించే ఉద్యోగులు ప్రధాన రహదారి ఫుట్‌పాత్‌లకు ఆనుకుని వాహనాలు పార్కింగ్ చేసి వెళ్లిపోతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇలా పార్కింగ్ చేయడాన్ని, ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలను పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది, కంచరపాలెం ట్రాఫిక్ సిబ్బంది అడ్డుకున్నప్పటికీ కొంత కాలం తర్వాత చూసీ చూడనట్లు వ్యవహరించడంతో సమస్యకు శాశ్వత పరిష్కారం లభించకుండా పోయింది. ప్రధాన రహదారులపై ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉన్నట్లయితే వాహనదారులకు కనీసం సర్వీస్ రహదారులు ఉపయోగపడుతుంటాయి. అవీ పార్కింగ్‌తో నిండిపోవడంతో ట్రాఫిక్ ముందుకు సాగని పరిస్థితి ఎదురవుతోంది. ఇప్పటికైనా సంబంధిత ట్రాఫిక్ విభాగం ఉన్నతాధికారులు, జోన్ – 5 పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, సచివాలయ టీపీవోలు పర్యవేక్షించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులు స్పందించాలి



ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేయడమే కాకుండా ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తే దుకాణదారులు దురుసుగా వ్యవహరిస్తున్నారు. ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు చేసేవారిని ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోకుండా పది నిమిషాలు పార్కింగ్ చేసిన వాహనాలకు ఫోటోలు తీసి చలానాలు పంపుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారించాలి.

– పుప్పాల శ్రీనివాస్, ఊర్వశి కూడలి

ఫుట్‌పాత్‌లపై నడవలేకపోతున్నాం



జ్ఞానాపురం రైల్వే స్టేషన్ ప్రాంతంలో ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారు. అటుగా రాకపోకలు సాగించాలంటే ఇబ్బందికరంగా ఉంది. ఉదయం, సాయంత్రం వేళల్లో ఫుట్‌పాత్‌లు నిండిపోతున్నాయి. రోడ్లపై నడిస్తే ప్రమాదాలు జరుగుతున్నాయి. ట్రాఫిక్ పోలీసులు, జీవీఎంసీ అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలి.

– పి.నాగమణి, ఐటీఐ జంక్షన్

వైఎస్సార్ సీపీ 'ఉత్తర' అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం



సీతంపేట : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు విశాఖ ఉత్తర నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఉత్తర్వులు విడుదల చేసింది. నియోజకవర్గ యూత్ వింగ్ అధ్యక్షునిగా మువ్వల సంతోష్‌కుమార్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా పప్పుల సునీత, బీసీ సెల్ అధ్యక్షునిగా బొడ్డేటి కిరణ్‌కుమార్, ఎస్సీ సెల్ కొరవాడ చిన్నారావు, ఎస్టీ సెల్ నల్లబోతుల సతీష్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ సొనాడి సురేష్, మున్సిపల్ వింగ్ వావిలపల్లి ప్రసాద్, ఆర్‌టీఐ వింగ్ ఎస్‌కే.బాబ్జి, వలంటీర్స్ వింగ్ శ్రీనివాస్ బాద, వాణిజ్య విభాగం కర్రి మురళీకృష్ణారెడ్డి, వీవర్స్ వింగ్ గుదే రాజు, వైఎస్సార్‌టీయూసీ సారిపిల్లి సంతోష్, అంగనవాడీ వింగ్ తాటిపూడి రత్నం, లీగల్ సెల్ బోర పరదేశి రెడ్డి, సోషల్ మీడియా వింగ్ కొట్యాడ సూర్యనారాయణ, ఐటీ వింగ్ గరబాపు అనిల్ శర్మ, దివ్యాంగుల విభాగం నీలిపు ఈశ్వరరావు, డాక్టర్స్ వింగ్ వి.ఆర్.వి. కృష్ణకిశోర్, ఇంటలెక్చువల్స్ ఫోరం జి.వి.ఎస్. ఎస్.ఆర్.పట్నాయక్, బూత్ కమిటీలు నీలి రవి, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షునిగా సదరం జనేష్ నియమితులయ్యారు.

క్లుప్తంగా

ఎరుకుమాంబకు జలాభిషేకం



ఎరుకుమాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న ఈవో, భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం అర్చకుడు శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి స్వయంగా జలాభిషేకం నిర్వహించారు. అర్చకుడు భక్తుల గోత్ర నామాలతో విశేష పూజలు జరిపించారు. సాయంత్రం అమ్మవారిని నూతన చీర, పలు రకాలు పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం కూడా భక్తులు అమ్మవారికి జలాభిషేకం చేశారు. ఆలయ వర్గాలు భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా రహదారుల నిర్మాణం



రాజేంద్రనగర్‌లో కొత్తగా నిర్మించిన సీసీ రోడ్డు

సీతంపేట : జీవీఎంసీ 25వ వార్డు రాజేంద్రనగర్‌లో శిథిలమైన రహదారుల స్థానంలో కొత్తగా బీటీ, సీసీ రోడ్లు నిర్మించారు. సుమారు రూ.22 లక్షల నిధులతో రాజేంద్రనగర్ వార్డు కార్యాలయానికి వెళ్లే మార్గంలో బీటీ రోడ్, డ్రెయిన్లు, డ్రెయిన్లపై సిమెంట్ పలకలు వేశారు. అలాగే వార్డు కార్యాలయం నుంచి గ్రీన్ గార్డెన్ అపార్టుమెంట్ వైపు సీసీ రోడ్, డ్రెయిన్లు నిర్మించారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

7.2 కేజీల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరిని బుధవారం రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ అబ్దుల్ మారూఫ్, సీఐబీ/వాల్తేర్/ఆర్పీఎఫ్ ఏఎస్ఐ పిమ్‌కుమార్ సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో ఒడిశా రాష్ట్రంలోని రాయగడ జిల్లాకు చెందిన సుశాంత్‌నాగ్, రాజకుమార్ విశాఖపట్నం రైల్వేస్టేషన్ మీదుగా కేరళకు అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 7.2 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

పథకాల అమలుకు విజ్ఞప్తి



సిద్ధార్థ కాటీతో పెదిరెడ్ల రాజశేఖర్

తాటిచెట్లపాలెం : రైల్వేలో పనిచేస్తున్న ఓబీసీ ఉద్యోగులకు అన్ని సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు జరిగేలా చూడాలని ఆల్ ఇండియా ఓబీసీ రైల్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పెదిరెడ్ల రాజశేఖర్ కోరారు. ఈ మేరకు డీఆర్‌ఎం కార్యాలయంలో ఈస్ట్ కోస్ట్ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ సిద్ధార్థ కాటీని బుధవారం కలిసి విజ్ఞప్తి చేశారు. డిపార్ట్‌మెంట్ ప్రమోషన్లలో ఎస్సీ, ఎస్టీల మాదిరిగా ఓబీసీ ఉద్యోగులకు ప్రి సెలక్షన్ కోచింగ్ ఇచ్చేలా సిఫార్సు చేయాలని కోరారు. మరిన్ని సమస్యలపై మెమరండం సమర్పించారు. కార్యక్రమంలో వి.జయరాం, జి.నాగరాజు పాల్గొన్నారు.

కల్యాణ మండపంపై అదనపు అంతస్తు



రెల్లి వీధిలో కల్యాణ మండపంపై నిర్మించిన అదనపు అంతస్తు

సీతంపేట : జీవీఎంసీ 25వ వార్డు స్థానిక రెల్లి వీధి బీటీఆర్ నగర్‌లో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్మించిన కల్యాణ మండపంపై ప్రస్తుతం మరొక అంతస్తు నిర్మించారు. స్థానికుల వినతి మేరకు సుమారు రూ.30 లక్షల వ్యయంతో అదనపు అంతస్తు నిర్మించారు. ఇటీవల స్లాబ్ పనులు పూర్తయ్యాయి. త్వరలో పనులు పూర్తి చేసి కల్యాణ మండపం అందుబాటులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

పర్యావరణ పరిరక్షణపై ప్రచారం



పర్యావరణ పరిరక్షణపై ప్రచారం చేస్తున్న మాధవధార ప్రాథమిక పాఠశాల విద్యార్థులు

మురళీనగర్ : మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా గ్రీన్ క్లైమేట్ స్వచ్ఛంద సంస్థ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సహకారంతో మాధవదార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రీన్ క్లైమేట్ వార్షిక క్యాలెండర్‌ను వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా 101 గవర్నర్ కె.ద్వారకానాథ్ ఆవిష్కరించారు. అనంతరం మాధవ మురళీ పాఠశాల, మాధవధార ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించి ప్రచారం చేశారు. ప్లాస్టిక్ వస్తువుల వినియోగం వల్ల కలిగే నష్టాన్ని వివరించారు. ప్లాస్టిక్‌కు బదులు గోనె సంచులు, కాగితపు సంచులు వాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెడ్ మాస్టర్ ఎస్‌పీ నాయుడు, గ్రీన్ క్లైమేట్ కార్యదర్శి జేవీ రత్నం, మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు కె.మాధవి, సిటీ టెర్రస్ గార్డెన్ అడ్మిన్ మల్ల సరిత, ఎ.అరుణ పాల్గొన్నారు.

నేటి నుంచి మాఘమాస ఉత్సవాలు



కరపత్రం ఆవిష్కరిస్తున్న చైర్మన్ మూర్తి, తదితరులు

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డు నరసింహనగర్ దరి గణేష్‌నగర్‌లో గల శ్రీ త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన దేవాలయంలో మాఘమాస మహోత్సవాలు ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 28 వరకు నిర్వహించనున్నామని ఆలయ కమిటీ చైర్మన్ టీఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఈ మేరకు ఆలయంలో బుధవారం ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 2న అభిషేకాలు, సూర్య నమస్కారాలు చేయిస్తామన్నారు. 4న రథసప్తమి సందర్భంగా సూర్యనారాయణ స్వామికి పాలాభిషేకం, 6న కృత్తిక నక్షత్రం సందర్భంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అభిషేకాలు చేయిస్తామన్నారు. 12న పౌర్ణమి సందర్భంగా చండీహోమం, 16న సంకట హరి చతుర్థిని పురస్కరించుకుని లక్ష్మీగణపతి హోమం, 24న పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవాల్లో భాగంగా రాట ఉత్సవం జరిపిస్తామన్నారు. 26న మహా శివరాత్రి సందర్భంగా కాశీ విశ్వేశ్వరస్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, కల్యాణం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు జి.కృష్ణ, ఎం.ఎస్.ప్రకాశరావు, టి.వెంకటరావు, ఎం.సత్యనారాయణ, సీహెచ్.లక్ష్మణరావు, పి.అనిల్‌కుమార్, పి.రమణ, సీహెచ్.నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు అభినందనలు



పరేడ్‌లో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్లతో కళాశాల సెక్రటరీ మధుకుమార్, తదితరులు

సీతంపేట : ఇటీవల విజయవాడలో జరిగిన గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో పాల్గొన్న బుల్లయ్య కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లను కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ మధుకుమార్ బుధవారం ప్రత్యేకంగా అభినందించారు. కళాశాలకు చెందిన 13 మంది ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ యూనిట్ నుంచి పరేడ్‌లో పాల్గొన్నారు. వీరిలో మహిళా క్యాడెట్ ఎం.ఢిల్లీశ్వరి గర్ల్స్ వింగ్‌లో కంటింజెంట్ కమాండర్ అవార్డును రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు చేతుల మీదుగా అందుకుంది. వీరందరినీ బుధవారం కళాశాలలో అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ జి.ఎ స్.కె.చక్రవర్తి, కె.సోమేశ్వరరెడ్డి, డి.దీపక్ చౌదరి, మేజర్ టి.బ్రహ్మానందరెడ్డి, కెప్టెన్ కె.ఉమానాగేశ్వరి, ఫ్లైట్ లెఫ్టినెంట్ బి.ఆర్.ఎస్.లక్ష్మణరెడ్డి, సబ్ లెఫ్టినెంట్ టి.ఎస్.చైతన్య పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో క్రైస్తవులపై పెరిగిన దాడులు

బొల్లవరపు జాన్ వెస్లీ



క్రైస్తవ గీతాల సీడీ విడుదల చేస్తున్న జాన్‌వెస్లీ

సీతమ్మధార: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత క్రైస్తవులపై దాడులు పెరిగిపోయాయని, అందరం కలిసి ఎదుర్కొందామని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు బొల్లవరపు జాన్ వెస్లీ పిలుపునిచ్చారు. గురుద్వార దగ్గర గల ఎన్‌సీకే క్రైస్ట్ చర్చిలో బుధవారం నేషనల్ ఇండిపెండెంట్ బిషప్ కౌన్సిల్ (నిబ్) 24వ రాష్ట్రస్థాయి క్రైస్తవ నాయకుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎన్‌ఐబీ ఫౌండర్, అధ్యక్షుడు కాట్రగడ్డ మార్టిన్ మాట్లాడుతూ 24 ఏళ్లుగా వివిధ రాష్ట్రాల్లో నిబ్ ఆధ్వర్యంలో చేసిన సేవలను వివరించారు. రెవరెండ్ మార్టిన్ లూథర్ దామెర మాట్లాడుతూ ఏసు దైవ గుణాలను, క్రైస్తవ్యం సిద్ధాంతాలను ఏ విధంగా అనుసరించాలో తెలియజేశారు. ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ క్రైస్తవ్యం అంటే కృతజ్ఞతకు చిహ్నం అని అన్నారు. ఈనెల 26న శ్రీకాకుళం జిల్లా సోంపేటలో కల్వర్ బాప్టిస్ట్ చర్చి సభ్యులపై జరిగిన దాడి, తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలంలో పాస్టర్ చింతాడ రాజారెడ్డిపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయడాన్ని ఖండించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా క్రైస్తవులందరూ తమ హక్కుల కోసం ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన అవసరం ఉందన్నారు. క్రైస్తవ సంఘ కాపరులకు 8 నెలలుగా గౌరవ వేతనం, జెరూసలేం వెళ్లే యాత్రికులకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయాలన్నారు. అనంతరం క్రైస్తవ గీతాల సీడీని జాన్ వెస్లీ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అతిథులను సత్కరించారు. రెవరెండ్ ఎం.ఎ. పాల్, నిబ్ ఏపీ సెక్రటరీ బిషప్ ముక్తిపూడి సత్యకిరణ్, ఎం.అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

మురళీనగర్ : మురళీనగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతులు, నిర్వహణ పనులు చేపడుతున్నందున పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ జోన్ – 2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు బర్మాకాలనీ, మురళీనగర్, వర్మ కాంప్లెక్స్, తెన్నేటినగర్, బాలభాను పాఠశాల ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని చెప్పారు.

కంచరపాలెం: జోన్–2 డివిజన్ కంచరపాలెం సెక్షన్ పరిధి సబ్ స్టేషన్‌లో 11 కేవీ కంచరపాలెం ధర్మానగర్ ఫీడర్‌లో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ కంచరపాలెం జోన్ ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. దుర్గానగర్, గవర కంచరపాలెం, గొల్లకంచరపాలెం, రెడ్డికంచరపాలెం, సుభాష్‌నగర్, తుమ్మడపాలెం, గోకుల్‌నగర్, గౌరీనగర్, తోటవీధి, మల్లసూరివీధి, తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

వెలిగిన వీధిలైట్లు



ఆర్టీవో కార్యాలయం వద్ద వెలుగుతున్న కొత్త లైట్

సాక్షి ఎఫెక్ట్..

మురళీనగర్ : జీవీఎంసీ 49వ వార్డు పరిసరాల్లోని వీధి లైట్లు వెలగక కాలనీల్లో అంధకారం నెలకొన్న విషయమై సాక్షిలో బుధవారం ప్రచురించిన వార్తకు అధికారులు స్పందించారు. ఈ మేరకు వీధిలైట్ల విభాగం బీ అండ్ ఆర్ ఇంజినీరు రాజేష్, సూపర్‌వైజర్లు శ్రీను, జీవన్ పర్యవేక్షణలో టెక్నీషియన్లు శివ, సాయి, శేఖర్ రెడ్డి, భోగేష్ 49వ వార్డుతోపాటు పరిసర కాలనీల్లో వెలగని వీధిలైట్ల స్థానంలో కొత్తవి అమర్చారు. బర్మా కాలనీలో హైమాస్ట్ రింగ్‌లో నాలుగు లైట్లు కొత్తవి అమర్చారు. దీంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. వీటితోపాటు 49వ వార్డులోని పలు స్తంభాలపై, న్యూ సాయిరామ పార్లర్, ఆర్టీవో కార్యాలయం సమీపంలోని అయ్యప్పనగర్‌లో కొత్త లైట్లు అమర్చారు. మాధవధార రహదారిలో నాలుగు పోల్స్‌పై గురువారం లైట్లు అమర్చుతామని తెలిపారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ ప్రసాద్

సీతమ్మధార: ఆటో డ్రైవర్లు విధిగా రోడ్డు నిబంధనలు పాటించాలని ద్వారకా సబ్ డివిజన్ ట్రాఫిక్ సీఐ కేఎస్ఎన్‌వీవీ ప్రసాద్ తెలిపారు. గురుద్వారా జంక్షన్ వద్ద ఆటోడ్రైవర్లతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. బస్టాపుల వద్ద ఆటోలు పార్కింగ్ చేయరాదని హెచ్చరించారు. పాఠశాల ఆటో డ్రైవర్లు ఆరుగురికి మించకుండా పిల్లల్ని తీసుకెళ్లాలన్నారు. విధిగా సిగ్నల్ లైట్లు ఆన్ చేయాలని తెలిపారు. రోడ్డు మార్జిన్‌లోనే ప్రయాణించాలని పేర్కొన్నారు. ట్రాఫిక్‌కి ఆటంకం కలిగించేలా ఆటోలు పార్కింగ్ చేయవద్దని, డ్రైవర్ సీట్లో ప్రయాణికులను కూర్చోబెట్టుకోరాదని హెచ్చరించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ జంప్ చేసి ప్రమాదాలు కోరి తెచ్చుకోవద్దని హితవు పలికారు. ట్రాఫిక్ ఎస్ఐ ప్రతాప్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

పర్యావరణ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రీజనల్ ఇంజినీర్, గ్రీన్ క్లైమేట్ టీం సభ్యులు

మర్రిపాలెం : పర్యావరణ దినోత్సవాల క్యాలెండర్ అందరికీ అవసరమని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి రీజినల్ ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ ముకుంద అన్నారు. ఈ మేరకు బుధవారం ఉదయం 51వ వార్డు మాధవధార పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యాలయంలో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవో ముద్రించిన పర్యావరణ పరిరక్షణ దినోత్సవాల క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేర్కొన్న పర్యావరణ పరిరక్షణ రోజులన్నీ పొందుపరచడం వల్ల విద్యా సంస్థల్లో ఈ క్యాలెండర్ ఉంచుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం అందరూ కృషి చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ హితంగా జీవించాలన్నారు. కార్యక్రమంలో ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ శ్రీనివాస్, అసిస్టెంట్ ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ సూర్యకళ, ఆంధ్రా యూనివర్సిటీ రీసెర్చ్ రంగాచార్యులు, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం, కో ఆర్డినేటర్లు ఐ.కృష్ణకుమారి, జె.రవితేజ, గ్రీన్ వలంటీర్ రాజేశ్వరి, వనమాలి గార్డెన్స్ సభ్యులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న ప్రత్యేక ఆధార్ శిబిరాలు



జెడ్సీ శివప్రసాద్

సీతమ్మధార : జీవీఎంసీ జోన్ – 3 పరిధిలో ఎంపిక చేసిన సచివాలయాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలు గురువారంతో ముగియనున్నాయని జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ తెలిపారు. ఆయన జోనల్ కార్యాలయంలో బుధవారం 'సాక్షి'తో మాట్లాడారు. ఈ నెల 21 నుంచి ప్రారంభించిన శిబిరాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభించిందన్నారు. పుట్టినప్పటి నుంచి ఇంతవరకు ఆధార్‌కార్డు తీసుకోని పిల్లలకు ఈ శిబిరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. తూర్పు నియోజకవర్గం పరిధి 15వ వార్డు పాత వెంకోజీపాలెంలో గల 106వ నంబర్ సచివాయంలో, మద్దిలపాలెంలోని 117వ నంబరు సచివాలయంలో శిబిరాలు కొనసాగుతున్నాయన్నారు. ఉత్తర నియోజకవర్గంలోని అక్కయ్యపాలెం దరి లలితానగర్‌లో గల 125వ నంబరు సచివాలయంలో, పాత రేసపువానిపాలెంలో గల 138వ నంబర్ సచివాలయంలో ఆధార్ నమోదు చేస్తున్నారని తెలిపారు. దక్షిణ నియోజకవర్గంలోని దొండపర్తిలో గల 143వ నంబర్ సచివాలయంలో శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహారాజా బ్యాంక్‌కు 'బ్యాంకో బ్లూ రిబ్బన్ - 2024' అవార్డు



అవార్డు అందుకుంటున్న బ్యాంక్ సైబర్ సెక్యూరిటీ ఆఫీసర్ మంతెన ఆదిత్య వర్మ

సీతమ్మధార : జాతీయ స్థాయిలో కో – ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్‌లకు సంబంధించిన వ్యాపార పోటీలో ది మహారాజా కో – ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ 'బ్యాంకో బ్లూ రిబ్బన్ – 2024' అవార్డు సొంతం చేసుకుంది. ఈ నెల 28న బ్యాంకో వారు 'అడ్వాంటేజ్ అన్యువల్ సమ్మిట్ – 2025'ను ఆంబీ వాలీ సిటీలో లోనావాలా వేదికగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంక్ కేటగిరీ నందు రూ.275 కోట్ల డిపాజిట్ల సేకరణ విభాగంలో అవార్డు అందజేశారు. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా రిటైర్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ భార్గేశ్వర్ బెనర్జీ చేతుల మీదుగా మహారాజా బ్యాంక్ సైబర్ సెక్యూరిటీ ఆఫీసర్ మంతెన ఆదిత్య వర్మ అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో ప్రముఖులు ఎన్ఏఎఫ్‌సీయూబీ ప్రెసిడెంట్ లక్ష్మీదాస్, మహారాష్ట్ర స్టేట్ సైబర్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సంజయ్ సింత్రే (ఐపీఎస్), దేశ వ్యాప్తంగా వివిధ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్‌ల చైర్మన్లు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు పాల్గొన్నారు. మహారాజా బ్యాంక్‌కి అవార్డు రావడం చాలా ఆనందంగా ఉందని బ్యాంక్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.రామకృష్ణంరాజు, జనరల్ మేనేజర్ నిమ్మల నాగసత్యనారాయణ తెలిపారు. బ్యాంక్ నేటికి రూ.490 కోట్ల వ్యాపారం కలిగి ఉందని, ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే సుమారు రూ.45 కోట్ల వ్యాపారం చేసినట్లు తెలిపారు.